Eenadu

Dt- 29/10/17

# ప్రతి రైల్లో ఇద్దరు చోదకులు



## కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో మెట్రో రైలు అనుసంధానం

### ఇప్పటికే వందమంది లోకోపైలెట్‌లకు శిక్షణ

### వారిలో 20 మంది మహిళలు

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో హైదరాబాద్ మెట్రో రైలు పట్టాలపై పరుగులు తీయబోతోంది. మెట్రో పరుగులో కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలక భూమికను పోషిస్తున్నా, డ్రైవర్ల(లోకో పైలెట్) పాత్ర కూడా అత్యంత కీలకమేనని అధికారులు చెబుతున్నారు. ప్రతి మెట్రో రైల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండి రైలును పరుగులు పెట్టిస్తుంటారు. ఇప్పటికే వంద మందికిపైగా డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. వీరిలో 20 మంది మహిళా డ్రైవర్లూ ఉన్నారు. వీరంతా దాదాపు తెలంగాణకు చెందినవారే. ఒక్కరు విశాఖపట్నానికి చెందినవారు. వీరంతా (మిగతా 2లో)

Eenadu Dt 29/10/17.

# ప్రతి రైల్లో.. ఇద్దరు చోదకులు

(మొదటి పేజీ తరువాయి)

మెట్రో విధుల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నారు. రాజధానిలో 72 కిలోమీటర్ల పొడవునా మెట్రోరైలును తిప్పడానికి ప్రణాళిక సిద్ధంచేశారు. కొన్ని కారణాలతో పాత బస్తీలో నిర్మాణం ఆగిపోయింది. ప్రస్తుతం 66 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం జరుగుతోంది. మొదటి దశ కింద నవంబరు 28న ప్రధాని మోదీ చేతుల మీదుగా మియపూర్ నుంచి అమీర్‌పేట్ మీదుగా నాగోలు వరకు మెట్రోరైలు ప్రారంభించడానికి సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మెట్రోరైలు నడపడంలో కీలకమైనది కేంద్ర కమాండ్ కంట్రోల్ సెంటర్. ఆటోమేటిక్ ఆపరేషన్ సిస్టంతో రైలును నడపడానికి ఎల్ అండ్ టీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా కమ్యూనికేషన్ ఆధారిత నియంత్రణ(సీబీటీసీ) అనే అత్యంత అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. హైదరాబాద్‌ను ఆరు జోన్లుగా విభజించి ఈ వ్యవస్థ ద్వారా రైళ్లను నియంత్రించబోతున్నారు. జోన్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా అన్నిమార్గాల్లో రైళ్లను నియంత్రించనున్నారు. ఉప్పల్‌లో ఈ మొత్తం కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అనుసంధానం చేశారు. సీబీటీసీ విధానం వల్ల ప్రతి నిమిషంన్నరకు ఒక మెట్రోరైలును నడిపే అవకాశముంది. మెట్రోరైలు నడవడానికి ఈ ఆధునిక వ్యవస్థ ఎంత ముఖ్యమో డ్రైవర్ల వ్యవస్థ అంతే ముఖ్యం.

## డ్రైవర్ల పని తీరు ఇది..

మూడు కోచ్‌లతో ప్రతి రైలు నడుస్తుంది. ఈ రైలుకు వెనుక, ముందు ఇంజన్లుంటాయి. అన్నిమార్గాల్లో 57రైళ్లను నడపబోతున్నారు. ప్రస్తుతం మియాపూర్-నాగోలు మార్గంలో ప్రస్తుతానికి పది నిమిషాలకు ఒక రైలును నడపాలని భావిస్తున్నారు. 15-20రైళ్లను పట్టాలు మీదకు తేవాలని అనుకుంటున్నారు. ఏడాదిన్నర కిందటే దాదాపు మొదటి దశలో వంద మందిని ఎంపిక చేసి వారికి డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నారు. వీరంతా ప్రతి రైలు వెనుక, ముందు భాగంలో ఉండి కమాండ్ సెంటర్ సంకేతాలకనుగుణంగా పని చేస్తారు. అత్యవసరంగా సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం ఏర్పడి కమాండ్ కంట్రోల్ సెంటర్ పని చేయలేనప్పుడు డ్రైవర్లు రైలును మ్యాన్యువల్‌గా దగ్గరలోని స్టేషన్‌కు తరలించడంలో కీలక పాత్ర పోషిస్తారని మెట్రో అధికారి ఒకరు తెలిపారు. 'కమాండ్ కంట్రోల్ సెంటర్ పని చేసినంత వరకు ఇబ్బందేం ఉండదు. అక్కడ లోపం ఏర్పడితే కంట్రోల్ సెంటర్ సంకేతాల ఆధారంగా డ్రైవర్లే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది' అని ఈ సెంటర్‌లో పనిచేసే సీనియర్ అధికారొకరు తెలిపారు. ప్రస్తుతం ఉప్పల్, మియాపూర్ డిపోలకు వచ్చిన 57రైళ్లను పట్టాలెక్కించి పరీక్షించారు. అన్ని రైళ్లు ప్రయాణికులకు సేవలందించడానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.



మెట్రో కేంద్ర కమాండ్ కంట్రోల్ సెంటర్



లోకో పైలెట్ శిక్షణ పొందిన రాధ

## మెట్రో స్మార్ట్‌కార్డుకు బుకింగ్‌లు

మెట్రోరైలు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన స్మార్ట్‌కార్డు ముందస్తు బుకింగ్స్‌ను ఎల్ అండ్ టీ మెట్రోరైలు సంస్థ ప్రారంభించింది. నవంబరు 28న మెట్రో ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో చివరి నిమిషంలో రద్దీని తగ్గించేందుకు ముందుగానే నమోదు ప్రక్రియ మొదలుపెట్టింది. ఈమేరకు కార్పొరేట్ సంస్థలు, నివాస, వాణిజ్య సముదాయాలకు సమాచారం ఇవ్వడంతో పలుసంస్థలు ఇప్పటికే ముందుకొచ్చాయి. నమోదు స్పందనను బట్టి అవసరమైతే వారి కార్యాలయాలు, సముదాయాల్లోనే కియోస్క్‌ను ఏర్పాటు చేస్తారు. మెట్రో ఎక్కిన ప్రతిసారి నిలబడి టోకెన్ కొనాల్సిన పనిలేకుండా స్మార్ట్‌కార్డు 'నిబులా' ఉపయోగపడుతుంది. కనీస రీఛార్జీ రూ.200. ఇందులో రూ.వంద ధరావతు. గరిష్ఠంగా ఒకేసారి రూ.2వేల వరకు రీఛార్జ్ చేసుకోవచ్చు స్టేషన్లలోనే కాదు ఆన్‌లైన్లోనూ రీఛార్జ్‌కు అవకాశముంటుంది. ప్రస్తుతానికి డిమాండ్ తెలుసుకోవడానికి నమోదు చేపట్టారు. ప్రారంభానికి ముందు స్మార్ట్ కార్డులను విక్రయిస్తారు. ఎప్పటినుంచి విక్రయాలు అనేది సంక్షిప్త సందేశం ద్వారా నమోదు చేసుకున్నవారికి పంపిస్తామని ఎల్‌అండ్‌టీ తెలిపింది.